క్లుప్తంగా

రేపు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

హనుమంతునిపాడు: వైఎస్సార్ సీపీ మండల కార్యకర్తల సమావేశం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. సమావేశానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ హాజరవుతారన్నారు. మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు హాజరు కావాలని కోరారు.

వెలిగండ్ల: వైఎస్సార్ సీపీ మండల కార్యకర్తల సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు వెలిగండ్లలో నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, ఎంపీపీ రామన మహాలక్ష్మి, మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, మండలంలోని అన్ని గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విధిగా హాజరుకావాలని కోరారు.

నుచ్చుపాదలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

పామూరు: మండలంలోని చిలకపాడు లేఅవుట్‌లో నివేశనాస్థలాలు పొందిన లబ్ధిదారులు, కాలనీలు కట్టించుకున్న వారంతా తమ స్థలాలు, ఇళ్ల రిజిస్ట్రేషన్‌కోసం మండలంలోని నుచ్చుపాద సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు తెలిపారు. చిలకపాడు లేఅవుట్‌లో స్థలాలు పొందిన వారు ఎక్కువ మంది పామూరుకు చెందిన వారు కాగా వారు పామూరులోని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ కోసం వస్తున్నారని, దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వారంతా నుచ్చుపాద సచివాలయానికే వెళ్లాలని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

ఉలవపాడు: మండల పరిధిలోని రాజుపాలెం మామిడితోటల్లో పేకాట ఆడుతున్న వారికి ఎస్సై బాజిరెడ్డి ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. రాజుపాలెం తోటల్లో జూదం జరుగుతుందన్న సమాచారం మేరకు ఎస్సై సిబ్బందితో కలిసి దాడి చేశారు. దాడిలో ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.16,400, ఏడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

జరుగుమల్లి: మండల పరిధిలోని కామేపల్లి పోలేరమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు శ్రీధర శ్రీనివాస శర్మ అభిషేకాల అనంతరం పోలేరమ్మ మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈఓ రావెళ్ల శివశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గ్రంథాలయంలో'చదవటం నాకిష్టం'


పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

టంగుటూరు: టంగుటూరు గ్రంథాలయంలో ఆదివారం చదవటం నాకిష్టం కార్యక్రమాన్ని లైబ్రేరియన్ గుమ్మడి వర్ధనరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు గ్రంథాలయంలో వివిధ పుస్తకాలు, హిందీ పద్యాలు చదివారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థిని అశ్విని హిందీ పద్యాలు చెప్పి బహుమతి గెలుపొందింది.

20 మద్యం సీసాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎస్సై రాజేష్

పొన్నలూరు: మండలంలోని అంకిరెడ్డిపాలెం గ్రామంలో సీహెచ్ మాలకొండయ్య అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. నిందితుడి నుంచి 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

కనిగిరి కొండపై మళ్లీ జెండా ఎగరేద్దాం

- సమన్వయకర్త డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్


పామూరులో స్థానిక నాయకులతో డాక్టర్ దద్దాల నారాయణయాదవ్

పామూరు: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కనిగిరి కొండపై మళ్లీ జెండా ఎగురవేద్దామని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ అన్నారు. పామూరుకు ఆదివారం వచ్చిన ఆయన పలువురు నాయకులను కలిశారు. ఈసందర్భంగా పార్టీ విజయం, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు అందిన లబ్ధి, చేసిన అభివృద్ధిపై నాయకులతో చర్చించారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. పొదుపు మహిళలకు సున్నావడ్డీకి రుణాలు, వైఎస్సార్ ఆసరా, చేయూత, చిరువ్యాపారులకు వడ్డీలేని రుణాలు, పేద అక్కా చెల్లెమ్మలకు నివేశనాస్థలాలు, కాలనీల మంజూరు మొదలైన పథకాలతో ప్రభుత్వం, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిగా నిలిచారని, వచ్చే ఎన్నికల్లో మరోమారు జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసేందుకు వైఎస్సార్ సీపీకి తోడుగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా పామూరులో ప్రైవేట్ క్లినిక్‌లను ప్రారంభించడంతో పాటు వివాహ కార్యక్రమాల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్.చాంద్‌బాషా, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, అంబటి కొండారెడ్డి, పార్టీ యూత్ మండల అధ్యక్షుడు యాదాల వెంకట సాయికిరణ్, బూత్‌కమిటీ మండల అధ్యక్షుడు గట్లా విజయభాస్కర్‌రెడ్డి, కోటపాటి రవికుమార్ రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ చెనికల శ్రీనివాసులు, పిన్నిక రత్తయ్య, బెస్తసంఘం జిల్లా అధ్యక్షుడు ఓగూరి ఏడుకొండలు, గాజులపల్లి శ్రీనివాసరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 165 కుటుంబాలు చేరిక


దద్దాల నారాయణ ఆధ్వర్యంలో పార్టీలో చేరికలు

కనిగిరి రూరల్: పేదలకు అండగా నిలబడింది వైఎస్సార్ సీపీ జెండా ఒక్కటేనని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. స్థానిక శ్రీరంగాపురం వద్ద ఆదివారం రాత్రి సర్పంచ్ ఇండ్లా ఓబులేసు, వెంకట్రావ్ ఆధ్వర్యంలో 165 కుటుంబాలు టీడీపీలో నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరారు. వీరికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ పేద వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేశారన్నారు. ఎన్నికలప్పుడు మోసపూరిత మాటలతో ప్రజల వద్దకు వస్తున్న చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశాడని ధ్వజమెత్తారు. చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్, లోకేష్‌లు చెప్పే మాయ మాటలను ప్రజలు

నమ్మే స్థితిలో లేరన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలతో లబ్ధి పొందని కుటుంబం లేదన్నారు. పార్టీలో చేరిన వారిలో... నారబోయిన కొండయ్య, శ్రీను, తుపాకుల యోగయ్య, కేతనబోయిన చిన్న పెద్దన్న, బత్తుల లక్ష్మయ్య, నారాయణ, బొర్రా వెంకటేశ్వర్లు, ఎర్రయ్య, రోశయ్య, ఎనుమల గురువయ్య, కోనయ్య, మూడమంచు మాలకొండయ్య, వెంకటేశ్వర్లు, రామయ్య, అన్నిబోయిన గురవయ్య, కృష్ణయ్య, బాలసుబ్బయ్య, మాసిపోగు యోహాను, జీ దానియేలు, కే సరోజనమ్మ, మాసిపోగు జాన్, చిన్న , దావీదు, ఏసు, ఇస్రాయేలు, ఏబేలు, యోహాను, లక్ష్మయ్య, దేవన్న, వెంకటేశ్వర్లు, రమణయ్య, పెద్ద పుల్లయ్య, చిన్న పుల్లయ్య, మాల్యాద్రి, పెద మాలకొండ్రాయుడు, చిన్న మాలకొండ్రాయుడు, చిన్న, ఏసు, శంకర్‌లతో పాటు మరి కొందరు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీల సంఘ అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీలు మడతల కస్తూరిరెడ్డి, మేకల శ్రీనివాసుల యాదవ్, రామన తిరుపతిరెడ్డి, వాసవీ సత్ర సముదాయ జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, పార్టీ రాష్ట్ర నాయకులు చింతం శ్రీను, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, మూలే గోపాల్‌రెడ్డి, కటికల వెంకటరత్నం, తమ్మినేని సుజాత, శ్రీహరిరెడ్డి, సిద్ధారెడ్డి, మార్తాల వెంకటేశ్వరరెడ్డి, పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ, మహానివేదన


గోపూజ నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న చైర్మన్, ఈవో, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ, మహానివేదన రుత్వికులు సత్యనారాయణ, మహంకాళి ప్రసాదుశర్మల ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి విశిష్ట పూజలు, పంచామృతాభిషేకం చేశారు. గోవుకు శాస్త్రోక్తంగా అర్చకులు గోపూజ నిర్వహించారు. అనంతరం భజంత్రీల మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ మహా నైవేద్యంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ జి.రమణారెడ్డి, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


గుమ్మనంపాడు కాలనీవాసులతో మాట్లాడుతున్న సీఐ రామానాయక్

పామూరు: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఎవ్వరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ యం.రామానాయక్ అన్నారు. మండలంలోని గుమ్మనంపాడు, కాలనీలో ఆదివారం సాయంత్రం సీఐ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా సీఐ గ్రామాల్లో గతంలో జరిగిన ఎన్నికలు జరిగిన తీరు, ఇతర విషయాలపై క్షేత్రస్థాయిలో గ్రామస్తులు, ఓటర్లతో చర్చించారు. పోలింగ్‌బూత్‌లలో వసతులు, విద్యుత్, భద్రతాపరమైన అంశాలకు సంబంధించి బూత్‌ల వద్ద స్థానికులతో చర్చించారు.

సొంతిల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం


బోగనంపాడులో రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుధాకరరావు

పొన్నలూరు: గ్రామాల్లో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసి రిజిస్ట్రేషన్ చేస్తోందని తహసీల్దార్ ఎంవీకే సుధాకరరావు పేర్కొన్నారు. మండలంలోని బోగనంపాడు, లింగంగుంట, ముప్పాళ్ల, చెరుకూరు గ్రామాల్లో ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా మండలంలో మొత్తం 1297 మందికి స్థలాలు మంజూరు చేయగా, ఇప్పటి వరకు 926 పట్టాల రిజిస్ట్రేషన్ పూర్తయిందని వెల్లడించారు. మిగిలిన లబ్ధిదారులు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంచి స్నేహితులుంటే మంచి జీవితం


మాట్లాడుతున్న వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జాలిరెడ్డి

ఉలవపాడు: మంచి స్నేహితులు ఉంటే జీవితం ఎంతో మంచి గా ఉంటుందని, విద్యార్థులు మంచి స్నేహితులను ఎంచుకోవాలని వైఎస్సార్‌టీయఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కేశవరపు జాలిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక శ్రీ సాయి హైస్కూల్‌లో జరిగిన వార్షిక వేడుకలకు ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడి లేకుండా చదవాలని తెలిపారు. మంచి రాతతో తప్పులు లేకుండా పరీక్షలు రాయాలన్నారు. ఎంఈఓ ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థులు గురువులపై గౌరవభావం కలిగి ఉండాలన్నారు. కరస్పాండెంట్ వెంకటశేషమ్మ, ప్రిన్సిపల్ మౌనిక ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత


డ్రమ్ములు పంపిణీ చేస్తున్న చింతపల్లి హరిబాబు

టంగుటూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు పేర్కొన్నారు. మండలంలోని కందులూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ, ఎస్టీ రైతులు 32 మందికి ఆదివారం డ్రమ్ములు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి పసుమర్తి ఈశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి మన్నం వెంకయ్య, సురేంద్ర, పసుమర్తి ఆనంద్, రాజేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విజయలక్ష్మి, సుజాత, శృతి, తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

జరుగుమల్లి: పొగమంచు కారణంగా ఎదురుగా వస్తున్న ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై వావిలేటిపాడు అడ్డరోడ్డు వద్ద చోటుచేసుకుంది. కావలి నుంచి ఒంగోలు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వావిలేటిపాడు అడ్డరోడ్డు వద్ద టంగుటూరు నుంచి చింతలపాలెం వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. స్వల్పంగా గాయపడిన ఇద్దరిని 108 వాహనంలో జీజీహెచ్‌కు తరలించారు. ఈ సంఘటనలో బస్సులో ఐదు టికెట్ రోల్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. సంఘటనా స్థలాన్ని జరుగుమల్లి ఎస్సై బీవీ వెంకటేశ్వరరావు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ


మైక్‌సెట్‌ను బహూకరిస్తున్న దాత రామకోటిరెడ్డి

పొన్నలూరు: మండలంలోని ముప్పాళ్ల జెడ్పీ పాఠశాలకు గ్రామానికి చెందిన దాతలు గుండాల వెంకటరామిరెడ్డి, గుండాల రామకోటిరెడ్డి రూ.30 వేల విలువ చేసే మైక్‌సెట్‌ను ఆదివారం బహూకరించారు. ఈ సందర్భంగా దాతలను పాఠశాల హెచ్‌ఎం కె.ఆదాం అభినందించారు. దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బాగా చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కేవీ కృష్ణారెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

పీఆర్ మినిస్ట్రీయల్ ఉద్యోగుల కమిటీ ఎన్నిక


నూతన కమిటీని సన్మానిస్తున్న ఉద్యోగ సంఘాలు

కనిగిరి రూరల్: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘ కనిగిరి సమితి నూతన కమిటీ ఎన్నిక ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. కనిగిరి సమితి అధ్యక్షుడిగా ఎస్‌కే రహమత్‌బాషా, ఉపాధ్యక్షునిగా జి.పురుషోత్తం, ప్రధాన కార్యదర్శిగా పి.గురుప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా జీవీఎస్ఆర్ఎస్ శర్మ, కోశాధికారిగా ఎస్‌కే యస్దానిబాషా, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా కేటీవీ నరసింహారావు, ఆర్ శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ఎస్‌కే రహిమాన్, పరిపాలన అధికారి, సహాయ ఎన్నికల అధికారిగా తిరుపాలు వ్యవహరించారు. కార్యక్రమంలో పంచాయతి రాజ్ ఉద్యోగుల సంఘ నాయకులు జిల్లా అధ్యక్షుడు కె.విద్యాసాగర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణంరాజు, ఏపీ ఎన్‌జీఓ తాలూకా అధ్యక్షుడు పిల్లి వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా ఉంటా


ముస్లింల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సురేష్

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి సురేష్
- షాదీఖానా, ఆటో నగర్ ఏర్పాటుకు హామీ

సింగరాయకొండ(మర్రిపూడి): ముస్లింలకు అండగా ఉండి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి కృషి చేస్తానని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. సింగరాయకొండ మండల కేంద్రంలోని షాదిఖానాలో ఆదివారం రాత్రి ముస్లింలతో ఆత్మీయ సమావేశంలో మంత్రి సురేష్ పాల్గొన్నారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల సంక్షేమానికి ఎంతో కృషి చేశారన్నారు. ముస్లిం మత పెద్దలు కోరినట్లుగా షాదిఖానా అభివృద్ధికి సుమారు 70 లక్షల రూపాయలు అవసరమని ఆ నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. రూ.10 లక్షలతో ఈద్గా మైదానాన్ని అభివృద్ధి చేస్తామని, ముస్లింలకు గురుకుల పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముస్లింమైనారిటీల నివాస ప్రాంతాల్లో ఇంకా అవసరమైన చోట రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తామని చెప్పారు. ముస్లిం మహిళలకు రెండు విడతల్లో తన సొంత నిధులతో 20 కుట్టుమిషన్లు అందిస్తానని ప్రకటించారు. ముస్లింల శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఇళ్ల స్థలాల పంపిణీ, ఇళ్ల నిర్మాణానికి భరోసా ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ.. ఇచ్చిన మాట నెరవేర్చడమే తన నైజమని స్పష్టం చేశారు. ముస్లింల చిరకాల స్వప్నమైన ఆటోనగర్ ఏర్పాటు చేసి, అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం ముస్లిం నేతలు మంత్రి సురేష్‌ను గజమాలతో సత్కరించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, షేక్ పటేల్, షేక్ సలీంబాషా, షేక్ సలీం, షేక్‌ఇస్మాయిల్, షేక్ సుల్తాన్, షేక్ కరీం, పండ్లకొట్టు బాషా, షేక్ అబ్దుల్లా, షేక్ ముజీబ్, షేక్ ఇంతియాజ్, పఠాన్ రియాజ్, షేక్ కరిముల్లా, షేక్ జావిద్, షేక్ మస్తాన్, షేక్ గౌస్, షేక్ అబ్దుల్ మజీబ్ పాల్గొన్నారు.

34 మందికి సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు

- బాధితులకు రూ.38.99 లక్షల మేర లబ్ధి
- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ వెల్లడి


మంత్రి ఆదిమూలపు సురేష్

టంగుటూరు: కొండపి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 34 మందికి 38.99 లక్షల రూపాయలు మంజూరయ్యాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితుడినైన తర్వాత సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. నూతన దరఖాస్తులతోపాటు గతంలో వివిధ లోపాలతో తిరస్కరించిన దరఖాస్తులను సరిచేయించి నిధులు మంజూరు చేయించినట్లు మంత్రి వివరించారు. గత నెలలో ఆరుగురికి రూ.7.85 లక్షలు అందించినట్లు తెలిపారు. తాజాగా కొండపి మండలంలో ఆరుగురికి రూ. 7.98 లక్షలు, మర్రిపూడి మండలంలో ఆరుగురికి రూ.6.10 లక్షలు, పొన్నలూరు మండలంలో నలుగురికి రూ.3.68 లక్షలు, సింగరాయకొండ మండలంలో ఏడుగురికి రూ.4.77 లక్షలు, టంగుటూరు మండలంలో ఇద్దరికి రూ.3.70 లక్షలు, జరుగుమల్లి మండలంలో 8 మందికి రూ.12.11 లోలు, కందుకూరులో ఒకరికి రూ.70 వేలు మంజూరయ్యాయని వెల్లడించారు.

నేడు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సింగరాయకొండ(మర్రిపూడి): సింగరాయకొండ మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి ఆదిమూలపు సురేష్ పంపిణీ చేస్తారని పార్టీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

వైఎస్సార్ సీపీలో గ్రూపుల్లేవు

- మంత్రి ఆదిమూలపు సురేష్


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సురేష్



సింగరాయకొండ(మర్రిపూడి): కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీలో గ్రూపులేవీ లేవని, ఒకవేళ ఉన్నా అవన్నీ టీ కప్పులో తుఫాను లాంటివని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. సింగరాయకొండ మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరుల ఆత్మీయ సమావేశంలో మంత్రి మాట్లాడారు. కొండపి వైఎస్సార్ సీపీలో ముగ్గురు సమన్వయకర్తలు మారినా, ప్రతి ఒక్కరికీ అభిమానులు ఉన్నారని, వారంతా జగన్ కుటుంబంలో సభ్యులని వివరించారు. ఈసారి కొండపిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. తనను ప్రతిపక్షాలు వలస పక్షి అని విమర్శిస్తున్నాయని, రాజ్యాంగం ప్రకారం ఎక్కడైనా పోటీ చేసే హక్కు తనకు ఉందన్నారు. తన గెలుపునకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంత్రి తనయుడు విశాల్, పార్టీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలి

- పీడీసీసీబీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి


మాట్లాడుతున్న పీడీసీసీబీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి

కనిగిరి రూరల్: విద్యార్థులు లక్ష్యసాధన దిశగా ముందడుగు వేసినప్పుడు బంగారు భవిష్యత్ లభిస్తోందని పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెస్సార్ కళాశాల 32వ వార్షిక వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ టి.వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం బాలిక విద్యోన్నతికి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని వివరించారు. క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదిగి పాఠశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి భావిభారత పౌరులన్నారు. ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద వర్గాల్లో విద్యాభివృద్ధికి విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా వంటి అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. ఎంపీపీ దంతులూరి ప్రకాశం, వాసవీ సత్ర సముదాయ జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థి దశలో నుంచే క్రమశిక్షణ, ఏకాగ్రతతో ముందుకు సాగినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. అనంతరం కళాశాల కమిటీ పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డిని, మున్సిపల్ చైర్మన్ గఫార్‌ను, ఎంపీపీ దంతులూరి ప్రకాశంను, వాసవీసత్ర సముదాయ జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతులు అందచేశారు. హెచ్‌ఎం కలువ విజయలక్ష్మి, వ్యక్తిత్వ వికాస నిపుణులు కరిమద్దెల నరసింహారెడ్డి, కవి కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జేవీవీ రాష్ట్ర నాయకులు ఎస్‌కే గయాజ్, వీ మాలకొండారెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

కొనకనమిట్ల: మండలంలోని సలనూతల గాజులపల్లి గ్రామంలో గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, నాగేంద్రస్వామి శిఖర, కలశ, ఆదిత్య నవగ్రహ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠ మహోత్సవ క్రతువులను ఆగమ పండితుడు జేఎల్ కుమార్ శర్మ పర్యవేక్షించారు. ధ్వజస్తంభ దాత దాత మువ్వా వెంకటరెడ్డి, ఈశ్వరి దంపతులను గ్రామస్తులు సన్మానించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని నైవేద్యాలు సమర్పించారు. పూర్ణాహుతి, శాంతి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుల సహకారంతో భక్తులకు అన్న సంతర్పణ చేశారు.